ఎక్కడి చెత్త అక్కడే!

- అరసవల్లిలో క్షీణించిన పారిశుధ్యం
- వారం నుంచి సమ్మెలో కార్మికులు
- మండిపడుతున్న స్థానికులు


ఆదిత్యనగర్ కాలనీలో చెత్త నిల్వలు


కాలువల్లో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

అరసవల్లి: ఆరోగ్య క్షేత్రం అరసవల్లిలో పారిశుద్ధ్యం లోపించింది. దుర్వాసన వెలువడుతుండటంతో స్థానికులతో పాటు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూర్యనారాయణ స్వామి దర్శనానికి నిత్యం ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఆలయానికి వచ్చే మార్గాల్లో అపారిశుద్ధ్య వాతావరణమే వీరికి స్వాగతం పలుకుతోంది. గత ప్రభుత్వం హయాంలో రోజూ తడిచెత్త పొడి చెత్తను వేర్వేరుగా ఇంటింటికీ వచ్చి చెత్తను సేకరించేలా మొబైల్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చి వీధుల్లోకే వెళ్లేలా విధానాన్ని అమల్లోకి తెచ్చారు. శివారు ప్రాంతాలతో పాటు అన్ని కాలనీలు, వీధులు చెత్త రహిత ప్రాంతాలుగా కనిపించేవి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారిపోయింది. గత ప్రభుత్వం నియమించిన పారిశుద్ధ్య కార్మికులను ఉద్యోగాల నుంచి తొలిగించేలా ప్రస్తుత పాలకులు నిర్ణయానికి వచ్చారు. దీంతో ఉన్నపళంగా శానిటరీ మేస్త్రిలను తక్షణమే తొలిగించేలా కార్పొరేషన్ కమిషనర్ చర్యలకు దిగారు. వారికి మద్దతుగా కార్మికులు సమ్మెకు దిగారు. దీంతోవారం రోజులుగా నగరంలోని చాలా ప్రాంతాలు కంపు కొడుతున్నాయి. చెత్త పేరుకుపోవడంతో స్థానికులు కూడా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా అరసవల్లి ప్రాంతంలోని ఆదిత్యనగర్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, కామేశ్వరి నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు చెత్తతో నిండిపోయాయి. దోమల బెడద పెరిగిపోవడంతో పాటు దుర్వాసనతో వెలువడుతోంది. ఇప్పటికైనా 'చెత్త' రాజకీయాలు మానుకుని యథావిధిగా శానిటరీ మేస్త్రిలకు ఉద్యోగావకాశాలను కల్పిస్తే.. ఎప్పటిలాగానే శానిటేషన్ గాడిలో పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దుర్వాసనతో అవస్థలు..

వారం రోజులుగా వీధుల్లో చెత్త ఎత్తడం లేదు. రోజూ వచ్చే సిబ్బంది, చెత్త ఎత్తే వాహనం గానీ కొన్ని రోజులుగా మా వీధుల్లోకి రావడం లేదు. దీంతో ఎక్కడికక్కడ చెత్తచెదారాలు పేరుకుపోయాయి. దుర్వాసనతో స్థానికులంతా అవస్థలు పడుతున్నారు..అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

– బి.సత్యవతి, ఆదిత్యనగర్ కాలనీ

రాజకీయాలు తగదు..

గత ఐదేళ్లలో చెత్త ఎత్తే విధానంలో ఎక్కడా లోపం లేదు. ఒక్కరోజు కూడా ఇలాంటి దుస్థితి చూడలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చి చెత్తతో రాజకీయాలు చేయడం తగదు. ప్రభుత్వం మారగానే అప్పుడు పనిచేసిన వారిని తొలిగించడంతో సమ్మెకు దిగారు. దీంతో ఎక్కడికక్కడ చెత్త దొర్లుతోంది.

– ఎ.అప్పలసూర్యనారాయణ, అరసవల్లి

తిలక్‌నగర్‌లో పది రోజులుగా..

శ్రీకాకుళం: నగరంలోని తిలక్‌నగర్ కాలనీలో పది రోజులుగా పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తొలగించడం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.


తిలక్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్త

క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల ఔదార్యం


విరాళం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ఎన్‌టీఆర్ మున్సిపల్ హైస్కూల్ అభివృద్ధికి 1966 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు రూ.1,34,00 సేకరించారు. ఈ మొత్తాన్ని మంగళవారం పాఠశాల సంఘ అధ్యక్షుడు వీజీకే మూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందచేసిన ప్రతినిధులు సీహెచ్.బాపయ్య, ఎల్.రామలింగస్వామి, పేర్ల నర్సింగరావులను అభినందించారు. కార్యక్రమంలో యు.వి.రమణ, ఎ.నరసింగరావు, తెలుగు రామారావు, ఎ.రామ్మోహన్, పి.మల్లేశ్వరరావు, జె.ఎస్.ఎస్.ప్రకాష్, ఎం.ప్రభాకరరావు, కె.ఫల్గుణరావు, టి.బాలమురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'అపార్'కు నాలుగు కౌంటర్లు


కౌంటర్ల వద్ద జనాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): 'అపార్' కష్టాలు అనే శీర్షికన ఈ నెల 19న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నాలుగు కౌంటర్లు ఏర్పాటుచేశారు. దీంతో జనన ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు సరిచేసుకునేందుకు పెద్ద క్యూలైన్ల కష్టాలు తీరాయని పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

స్కాన్ చేయండి.. బిల్లు చెల్లించండి..


మైక్‌తో ప్రచారం చేస్తున్న విద్యుత్ సిబ్బంది

అరసవల్లి: విద్యుత్ వినియోగదారులకు బిల్లులు చెల్లించే విషయంలో మరింత అవగాహన పెంచే లక్ష్యంలో విద్యుత్ శాఖాధికారులు మరో అడుగు ముందుకేశారు. ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు సూచనల మేరకు డి–1 పరిధిలోని అరసవల్లి ప్రాంతంలో రెండు రోజులుగా మైక్ ద్వారా ప్రచారాలు సాగిస్తున్నారు. డి–1 ఏఈ సురేష్ ఆధ్వర్యంలో లైన్‌మేన్ లక్ష్మీనారాయణ, జేఎల్ఎం రాజులు బైక్‌పై మైక్ పట్టుకుని వినియోగదారులకు బిల్లుల చెల్లింపులపై అవగాహన కల్పిస్తున్నారు. బిల్లు వెనుక భాగంలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి బిల్లులు చెల్లించవచ్చని సూచించారు. గడువు తీరినప్పటికీ ఇంకా బిల్లులు సకాలంలో చెల్లించని వారు అపరాధ రుసుముతో తక్షణమే చెల్లించాలని కోరారు.

'గడప గడప' నిధుల విడుదలకు హైకోర్టు ఆదేశం


మొదలవలస చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని చిలకపాలెంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చేసిన పనులకు బిల్లులు చెల్లించేలా తక్షణమే నిధులు విడుదల చేయాలని హైకోర్టు ఆదేశించినట్లు హైకోర్టు న్యాయవాది, ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి తెలిపారు. ఫరీదుపేటలో తన కార్యాలయంలో మంగళవారం వివరాలు వెల్లడించారు. కాంట్రాక్టర్ డొంక అనూష బిల్లు నిలుపుదలపై హైకోర్టును ఆశ్రయించారని, రెండు నెలల్లోపు బిల్లులు చెల్లించాలని కోర్టు జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించిందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రూ.15.50 లక్షలు పనులు చేశారు. ప్రస్తుతం ఈ పనులు నిలుపుదల చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం


కార్మికులను సన్మానిస్తున్న సాయికుమార్

రణస్థలం: పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు ఎనలేనివని, కరోనా వంటి ఆపత్కాల సమయంలోనూ అద్భుత సేవలందించారని వైఎస్సార్ సీపీ నేత పిన్నింటి సాయికుమార్ అన్నారు. జె.ఆర్.పురం చెత్త సేకరణ కేంద్రం వద్ద కాఫీ విత్ క్లాప్‌మిత్ర కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులను దుశ్శాలువతో సత్కరించి వారితో కలిసి కాఫీ తాగారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల ప్రత్యేకాధికారి ఐ.వి.రమణ, ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రేతవి, ఈవోపీఆర్‌డీ బలివాడ ప్రకాశరావు, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ, శానిటేషన్ మేస్త్రి పాణికుమార్ పాల్గొన్నారు.

భద్రమ్మకు చల్లదనం

బలగలోని భద్రమ్మతల్లి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి సేవకుల ఆధ్వర్యంలో భక్తులు ముర్రాట్లు సమర్పించి చల్లదనం చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్



వైభవంగా కుంకుమ పూజలు

జి.సిగడాంలోని సత్యసాయిబాబా మందిరంలో మంగళవారం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. సత్యసాయి జయంతి ఉత్సవాలలో భాగంగా వేదపండితులు శ్రీనివాసరావు శర్మ ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



– జి.సిగడాం

అంతా చీకటిమయం

జిల్లా కేంద్రంలోని రైతు బజారు చీకటిలో మగ్గుతోంది. ఇక్కడకు రోజూ వందల సంఖ్యలో కొనుగోలుదారులు వస్తుంటారు. ఇక్కడ లైట్లు పోయి నాలుగు నెలలవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో సాయంత్రం పూట తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తక్షణమే అధికారులు చొరవ చూపి మరమ్మతులు చేయాలని కొనుగోలుదారులు కోరుతున్నారు.



– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ఉక్కు మహిళ ఇందిరాగాంధీ


ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


జిల్లా గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: భారతరత్న, దివంగత ప్రధాని ఇందిరాగాంధీ అనేక చారిత్రాక నిర్ణయాలు తీసుకుని ఉక్కు మహిళగా పేరుపొందారని పలువురు కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞానభవన్‌లో మంగళవారం ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షులు రెల్ల సురేష్ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేవీఎల్ఎస్ ఈశ్వరి, తెంబూరు మధుసూదన్‌రావు, బొచ్చ వెంకటరమణ, ఆబోతుల వెంకట్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: ఇందిరాగాంధీ దేశానికి గొప్ప సేవలు అందించారని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉపాధ్యాయిని రేవతి ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు ముగ్గులు, నాట్యపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా, సిబ్బంది కల్యాణి, వరలక్ష్మి, ప్రత్యూష, రామ్మోహన్, గణేష్ పాల్గొన్నారు.

ఏడో రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె


సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శానిటరీ మేస్త్రిలను విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు, అధ్యక్షుడు కె.వేణుగోపాల్‌రావు డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ శానిటరీ మేస్త్రీలు, పారిశుద్ధ్య కార్మికులు 7వ రోజు మంగళవారం కూడా సమ్మె కొనసాగించారు. నిరసన కార్యక్రమంలో మేస్త్రీల సంఘం అధ్యక్షుడు ముద్దాడ రామారావు, అల్లు రవి, టొంపల షణ్ముఖరావు, మున్సిపల్ యూనియన్ నాయకులు జె.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరించాలి



రణస్థలంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు


జి.సిగడాంలో ధర్నా చేస్తున్న నాయకులు

రణస్థలం: ప్రజలపై విద్యుత్ భారాలు మోపే ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం నాయకులు సీహెచ్ అమ్మన్నాయుడు, పోలాకి ప్రసాదరావు, వెలమల రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రణస్థలంలోని రామతీర్థం జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కోరారు. గత ప్రభుత్వ సమయంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ, జనసేన పార్టీలు వీటిని తీవ్రంగా వ్యతిరేకించాయని, మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చాయని గుర్తు చేశారు. నిరసన కార్యక్రమంలో పార్టీ నేతలు హరిబాబు, బైరెడ్డి రామకృష్ణ, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్ల బిగింపు నిలిపివేయాలని సీపీఎం నాయకులు పోలాకి ప్రసాదరావు, వెలమల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జి.సిగడాంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రేగాన శివుడు, కరగాన అప్పన్న, దూసి పరసయ్య, శిరుగుడు భాస్కరరావు, సూర్యనారాయణ, పైడయ్య, ఆసిరయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు స్టాల్ ప్రారంభం

శ్రీకాకుళం రూరల్: బలగ ప్రాంతంలోని సామూహిక మరుగుదొడ్లను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మంగళవారం ప్రారంభించారు. అనంతరం పంచాయతీరాజ్‌శాఖ ఏర్పాటు చేసిన వర్మీకంపోస్టు ఎరువుల కొనుగోలు స్టాల్‌ను ప్రారంభించారు. వర్మీకంపోస్టు ఉపయోగాలు, తయారీవిధానం వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు పాల్గొన్నారు.


వర్మీకంపోస్టు స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ

ఎచ్చెర్ల క్యాంపస్: మరుగుదొడ్లు వినియోగిస్తేనే సంపూర్ణ పారిశుద్ధ్యం సాధ్యమవుతుందని ఎచ్చెర్ల ఎంపీడీవో సీపాన హరిహరరావు అన్నారు. దోమాంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహించారు. అనంతరం కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బోర గన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మరుగుదొడ్ల వినియోగంపై జి.సిగడాం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ జి.రామకృష్ణరావు, సర్పంచ్ ముద్దాడ గౌరీ, పంచాయతీ కార్యదర్శి సాహు తదితరులు పాల్గొన్నారు.

వెల్డింగ్ షాపులో అగ్నిప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఏపీహెచ్‌బీ డౌన్ కాలనీ (జిల్లాపరిషత్ సమీపంలో)లో మంగళవారం రాత్రి లోపింటి రామకృష్ణకు చెందిన వెల్డింగ్‌షాపులో అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా వెల్డింగ్ మిషన్, కరెంట్ మీటర్, హ్యాండ్‌పంప్ మిషన్, వైర్లు కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ.లక్ష ఆస్తినష్టం సంభవించిందని ఏడీఎఫ్‌వో వరప్రసాదరావు తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే సిబ్బందితో వెళ్లి మంటలను అదుపు చేశామన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక పారాయణలు


పారాయణ చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పెద్దమందిరం, బ్యాంకర్స్ కాలనీ మందిరం, హయాతినగరంలోని సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక లలితాసహస్రనామ పారాయణలు నిర్వహించారు. ఈ సందర్భంగా రుగడ ఇందిరా కృష్ణ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అనంతరం సహస్రదీపారాధనలు జరిగాయి. కార్యక్రమంలో మందిరం కన్వీనర్ వెంకటరావు, కిల్లాన ఫల్గుణరావు, కోటేశ్వరరావు, సుధాకర్, భోజ్, శ్రీను, భాస్కర్, మోహనరావు, ఉషారాణి, భానుశ్రీ, పుష్పవల్లి తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న కేంద్ర మంత్రి కార్యాలయంలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ డైరీని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గంజి ఆర్.ఎజ్రా, గౌరవాధ్యక్షుడు పిన్నింటి అప్పన్న, పరిదాల పద్మభూషణ్ సాయి, గొండు మణితేజ్ పాల్గొన్నారు.

గ్రామసభల్లో 590 ఫిర్యాదుల స్వీకరణ

జి.సిగడాం: గత నెల 16 నుంచి ఈ నెల 16 వరకు మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల ద్వారా 590 ఫిర్యాదులు స్వీకరించినట్లు జి.సిగడాం మండల తహశీల్దార్ ఎం.శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కొత్తపల్లి గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన ఆదాయం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన ఆదాయం లభిస్తుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి అన్నారు. ఐదు రోజుల ప్రకృతి వ్యవసాయ శిక్షకుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మంగళవారం జరజాంలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. బీజామృతం, ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, కషాయాలు తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు డీపీఎం ఎన్.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమాజఠలేశ్వరునికి లక్ష బిళ్వార్చన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధి ఉమాజఠలేశ్వరాలయంలో కార్తిక మాసం ఆరుద్ర నక్షత్ర పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు అశ్వనీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి లక్ష బిళ్వపత్రాలతో అర్చనలు చేశారు.



ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

గార/జి.సిగడాం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గార జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. హెచ్ఎం పద్మావతి ఆధ్వర్యంలో ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎన్.రామకృష్ణ, కుమారస్వామి, సీహెచ్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

జి.సిగడాం గ్రంథాలయంలో బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి సీహెచ్ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత ఝాన్సీ లక్ష్మీబాయి

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధులు సంఘ సంస్కర్తల స్మృతివనంలో ఝాన్సీలక్ష్మీబాయి 196వ జయంతి మంగళవారం నిర్వహించారు. విగ్రహ దాతలు సువ్వారి గాంధీతో పాటు మేడూరి ప్రసాదరావు, నిష్టల నరసింహమూర్తి, పైడి హరనాథరావు, నటుకుల మోహన్ లక్ష్మీబాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాపాక మాజీ ఎంపీటీసీ పి.సూర్యారావు, పైడి విజయ్, ముళ్ల ధర్మారావు, పెంకి చైతన్య పాల్గొన్నారు.

పెదపాడు గురుకుల విద్యార్థినులకు అభినందనలు

శ్రీకాకుళం రూరల్: పెదపాడులోని అంబేడ్కర్ గురుకులం విద్యార్థినులు ఇటీవల ఎచ్చెర్లలో జరిగిన జోనల్ మీట్ క్రీడా పోటీల్లో సత్తాచాటారు. కబడ్డీ, ఖోఖో క్రీడల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నారు. వీరిని ప్రిన్సిపాల్ రంగమణి, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

నాలుగున్నర దశాబ్దాలుగా అయ్యప్ప స్వామి సేవలో!

- ఏడాదిలో ఆరు నెలలు దీక్షలోనే రౌతు సింహాచలం గురుస్వామి

శ్రీకాకుళం కల్చరల్: అత్యంత నియమ నిష్టలు పాటిస్తూ దేవుడి సేవలో నిమగ్నమయ్యే బృహత్కార్యాలయాలలో అయ్యప్పస్వామి మాలాధారణ ఒకటి. చాలామంది ఒకటి, మూడు సార్లు మాల వేసి ఆపేస్తుంటారు. అలాంటిది శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చిరుద్యోగిగా పని చేసి ఇటీవలే ఉద్యోగ విరమణ చేసిన రౌతు సింహాచలం మాత్రం ఏకంగా 45 ఏళ్లుగా మాలాధారణ చేస్తుండటం విశేషం. తాను మాల ధరించడమే కాకుండా తోటివారు కూడా అయ్యప్ప మాల వేసేలా స్ఫూర్తి కలిగిస్తున్నారు. నగరంలో అయ్యప్ప మాలధారణలు జరగని సమయంలో బొబ్బిలి వెళ్లి అక్కడ గురుస్వామి ద్వారా మాలవేసుకోవడం ప్రారంభించినట్లు గురుస్వామి సింహాచలం తెలిపారు. తాను మాల వేసినప్పుడు ఒక్క అయ్యప్ప ఆలయం కూడా నగరంలో లేదన్నారు. అప్పట్లో పాలకొండ రోడ్డులోని కోదండరామాలయంలోనే భక్తులతో మాలధారణలు చేయించేవాడినని గుర్తు చేసుకున్నారు. ప్రతి ఏడాది ఆరు మాసాలు దీక్షలోనే ఉంటానని తెలిపారు. ఒకసారి మూడేళ్ల పాటు అయ్యప్ప దీక్షలో ఉండి మళ్లీ శబరిమలలో మకరజ్యోతి దర్శనానికి వెళ్లి అక్కడ మాల విసర్జనచేసి, మళ్లీ అక్కడే మాలధారణ చేసుకొని వచ్చినట్లు వివరించారు. అయ్యప్ప స్వామి దయతో ఇప్పటికీ నిరంతరం దీక్షలు కొనసాగిస్తున్నానని తెలిపారు.


అయ్యప్ప సన్నిధానంలో గురుస్వామి సింహాచలం

19వ వర్ధంతి



మీ భార్య : శ్రీమతి శివపార్వతి
కుమారుడు Dr. AHL స్వరూప్ – కోడలు: లక్ష్మీప్రియాంక
Associate Professor, M.Tech., Ph.D B.Tech
కుమార్తెలు: టి.శిరీష – అల్లుళ్లు: సత్యనారాయణ
జననం: 16-08-1960 - మరణం: 20-11-2005
అత్తయ్య – మామయ్య మరియు బంధుమిత్రులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం : 9951602845, 9951602849, 9912220367, 9705444191, 9010299083
ఎచ్చెర్ల : 9951602849
Office mail : sklmadvt@gmail.com